సాక్షి
జోగులాంబ గద్వాల

బుధవారం ¡ 7 ¡ ఆగస్టు ¡ 2024



అదిరే పట్టు..
పాలమూరు చేనేత కార్మికులు పట్టుచీరల నేతలో విశేష గుర్తింపు సాధిస్తున్నారు.
వివరాలు 8లో ▸



జూరాలకు తగ్గిన వరద
జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద నీరు క్రమంగా తగ్గుతోంది.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
27.4 /24.2

వాతావరణం
ఆకాశం అప్పుడప్పుడూ మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం , చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆర్టీసీ అద్దె బస్సులు

గద్వాల క్రైం: శ్రావణమాసంలో జరిగే పెళ్లి శుభ కార్యాలకు ఆర్టీసీ బస్సులు అద్దెకు ఇవ్వనున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి పెళ్లి ముహూర్తాలు ప్రారంభం కానుండడంతో ప్రభుత్వం 6వ తేదీ నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు బస్సులను బుక్ చేసుకున్న వారికి 10 శాతం డిస్కౌంట్ ఇచ్చేలా ఆదేశాలు అందాయని తెలిపారు. శుభకార్యాలు, విహారయాత్రలకు ఆర్టీసీ వారు బస్సు సర్వీసులను అద్దెకు ఇవ్వనున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు సీఈ పర్యటన

ధరూరు: మండలంలోని ఆయా ప్రాజెక్టులను పరిశీలించేందుకు గాను తెలంగాణ ప్రాజెక్టుల సీఈ రఘునాధరావు బుధవారం మండలంలో పర్యటించనున్నారు. వరదల నేపథ్యంలో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును సందర్శించి పీజేపీ అధికారులతో సమావేశమై ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలు తెలుసుకోవడంతో పాటు వారితో ప్రత్యేకంగా సమావేశం కానున్నట్లు తెలిసింది. అలాగే నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం లిఫ్టు–1లో తలెత్తిన సాంకేతిక లోపంతో నిలిచిన పంపులను పరిశీలించడంతో పాటు ఇతర అంశాలపై పీజేపీ అధికారులతో రివ్యూ సమావేశంలో పాల్గొననున్నారు.

విద్యార్థి తరగతి గదిలో ఉండగానే తాళం



ఉండవెల్లి: మండల కేంద్రంలో ఓ విద్యార్థి తరగతి గదిలో ఉండగానే గమనించకుండా తాళం వేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఎంపీపీఎస్‌లో రోహిత్ అనే విద్యార్థి రెండో తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలోనే మంగళవారం పాఠశాలకు వచ్చాడు. అతడు నిద్రపోగా.. ఎవరూ గమనించలేదు. సమయం అయిపోయాక అతడు లోపల ఉండగానే తరగతి గదులకు తాళం వేసి వెళ్లారు. కాసేపటికి రోహిత్‌కి మెళుకువ వచ్చింది. కానీ అప్పటికే అందరూ వెళ్లిపోవడం.. తరగతికి తాళం వేసి ఉండడంతో భయంతో కేకలు వేశాడు. దీంతో ఆ శబ్దం విని కొందరు వ్యక్తులు ప్రహరీదూకి వెళ్లి చూడగా రోహిత్ కన్పించాడు. కాగా వారు తరగతి గది తలుపులు పగులగొట్టి విద్యార్థిని బయటకు తీసుకువచ్చి ఇంటికి పంపించారు.

ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

గద్వాల క్రైం: జిల్లాలోని ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని.. స్థాయికి మించి వైద్యం చేస్తే చర్యలు తప్పవని జిల్లా ఇంచార్జ్ వైద్యాధికారి సిద్దప్ప అన్నారు. మంగళవారం జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆర్‌ఎంపీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత మూడు రోజుల క్రితం గోనుపాడులో ఆర్‌ఎంపీ నరేందర్‌రెడ్డి రోగులకు వైద్య చికిత్సలు నిర్వహించిన క్రమంలో కొంతమంది రోగులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈనేపథ్యంలో సదరు ఆర్‌ఎంపీపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది ఏంజెల్, మధుసూదన్ రెడ్డి, ఆర్‌ఎంపీలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ముఖ్యం

మల్దకల్: గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జెడ్పీ సీఈఓ కాంతమ్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని అమరవాయిలో స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమాన్నికి ఇమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గ్రామాలలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే గ్రామంలోని పురవీధులను పరిశీలించారు. గ్రామంలో రోడ్లపై మురుగు నిలిచిపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ కాలనీలో వర్షపు నీటితో పాటు మురుగు రోడ్లపై నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని కాలనీవాసులు సీఈఓ దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి, జీహెచ్‌ఎం నరేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

గద్వాల: జాతీయ జావెలిన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గద్వాల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. శివకుమార్ అండర్–16 జావెలిన్ త్రో విభాగం, 8వ తరగతి చదువుతున్న తేజాశ్రీ,లక్ష్మి అండర్–14 వంద మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ చాటారు. జిల్లాస్థాయి పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

‘తుమ్మిళ్ల’ నీటి విడుదలపై రగడ

మోటార్లు ప్రారంభించడంపై నెలకొన్న వివాదం

- నీటి విడుదలలో రాజకీయాలు తగవని ఎమ్మెల్యే విజేయుడు నిరసన.. పోలీసుల అరెస్టు
- రైతుల కోసం కష్టపడింది ఎవరో తెలుసన్న మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్
- నాటకీయ పరిణామాల మధ్య తుమ్మిళ్ల లిఫ్ట్‌కు నీటి విడుదల



ఉదయం తుమ్మిళ్ల వద్ద మోటార్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజేయుడు



కాసేపటి తర్వాత పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్

రాజోళి/శాంతినగర్: ఆర్డీఎస్ ఆయకట్టుకు సాగు నీరు అందించేందుకు తుమ్మిళ్ల లిఫ్ట్ కెనాల్ మోటార్లు ఆన్ చేసే కార్యక్రమం చేపట్టగా అది కాస్తా రసాభాసగా మారింది. తుమ్మిళ్ల ఎత్తిపోతల మోటార్లు ఆన్ చేసి ఆర్డీఎస్ డిస్ట్రిబ్యూటరీ– 23 నుంచి దిగువకు నీరు అందించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈమేరకు మంగళవారం ఉదయం 7.15 గంటలకు అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు తుమ్మిళ్లకు చేరుకుని మోటార్లు స్విచ్ ఆన్ చేసి, డీ–23 దగ్గర ఉన్న డెలవరీ సిస్టర్న్ దగ్గర నీటికి పూజ చేసేందుకు బయటలుదేరారు. మోటార్ ఆన్ చేసినప్పటికీ డెలవరీ సిస్టర్న్ దగ్గర నీరు విడుదల కాకపోవడంతో ఎమ్మెల్యే అధికారులకు ఫోన్ చేసి కారణమేంటని అడిగారు. వారు మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమారే మోటార్ మళ్లీ ఆఫ్ చేశారని సమాధానమిచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. వెంటనే ఆయన డీ–23 దగ్గరే ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ, నిరసన తెలుపుతూ అక్కడే బైఠాయించారు. ‘ఎమ్మెల్యేగా ప్రోటోకాల్ ప్రకారమే నీటి విడుదల **చేసేందుకు వచ్చాను. నేను ఆన్ చేసిన తర్వాత** మళ్లీ ఏ హోదాలో మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మోటార్లను ఆఫ్ చేస్తారని, వెంటనే ఆయనపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే విజేయుడు, పలువురికి ఏఎస్పీ గుణశేఖర్, డీఎస్పీ సత్యనారాయణ, సీఐ టాటా బాబు సర్ది చెప్పేందుకు ప్రయత్నించినా వినకపోవడంతో మధ్యాహ్నం వారిని అరెస్టు చేసి శాంతినగర్ సీఐ కార్యాలయానికి తరలించారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి..

ఈక్రమంలో తుమ్మిళ్ల నుంచి డి–23కి కాంగ్రెస్ కార్యకర్తలతో బయలుదేరిన మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌ను పోలీసులు పచ్చర్లలోనే నిలిపేశారు. **దీంతో ఆయన మాట్లాడుతూ.. నీరు రాకుండా నేనే** అడ్డుకుంటున్నానని బీఆర్‌ఎస్ నాయకులు అసత్యపు ప్రచారాలు చేస్తున్నారని, అందుకే రైతులతో కలిసి నీటి విడుదల చేస్తామని తేల్చి చెప్పారు. దీంతో పోలీసులు శాంతిభద్రతలను దృష్టిలో పెట్టుకుని ఇరువురు నాయకులు కూడా అక్కడి నుండి వెళ్లిపోవాలని లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. అయినా సంపత్‌కుమార్ ఒప్పుకోలేదు. ఆర్డీఎస్ ఆయకట్టును సస్యశ్యామలం చేసేందుకు ప్రాణాలకు తెగించి నిరాహార దీక్ష చేశానని, ఆర్డీఎస్‌ను అడ్డు పెట్టుకుని డబ్బు సంపాదించుకున్న వారు బూటకపు మాటలతో రైతులను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ఎవరు నిజమైన నాయకులో ప్రజలకు తెలుసని అన్నారు. చివరకు నాటకీయ పరిణామాల నడుమ సంపత్ **కుమార్ అక్కడ ఉండగానే.. సాయంత్రం 4.10** గంటలకు అధికారులు తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా నీటిని విడుదల చేశారు.



తుమ్మిళ్ల లిఫ్టు నుంచి కెనాల్‌లోకి విడుదలవుతున్న నీరు

పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే ఆందోళన

పోలీసులు మాయమాటలు చెప్పి తమను అరెస్ట్ చేశారని ఎమ్మెల్యే విజేయుడు ఆరోపించారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా అరెస్ట్ చేస్తున్నామని, కలెక్టర్ లేదా జిల్లా అధికారులు తుమ్మిళ్ల మోటార్లు ఆన్ చేసి నీటి విడుదల చేస్తారని చెప్పి కాంగ్రెస్ నాయకులతో ప్రారంభించారని, ప్రోటోకాల్ ప్రకారం వెళ్లిన ఒక ఎమ్మెల్యేను అవమానించడంతోపాటు అరెస్టు చేస్తారా అని మండిపడ్డారు.



నిరసనకు దిగిన ఎమ్మెల్యే విజేయుడిని అరెస్టు చేసి వ్యాన్‌లో తరలిస్తున్న పోలీసులు

ఆస్పత్రులు డొల్ల



ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో భారీగా వైద్యుల ఖాళీలు

- నర్సులు, ఫార్మసిస్టుల కొరతతో సేవలకు ఆటంకం
- నాణ్యతా ప్రమాణాల్లో పాలమూరు వెనకంజ
- జోగులాంబ గద్వాల, నారాయణపేటలో కనిపించని సౌకర్యాలు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతులపై కాగ్ రిపోర్ట్‌లో వెల్లడి

సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, నర్సులు, ఫార్మసిస్టుల పూర్తి స్థాయి నియామకం చేపట్టకపోవడంతో రోగులకు అందుతున్న వైద్యసేవల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా ఆస్పత్రిలో రాష్ట్రంలోనే అత్యధిక శాతం వైద్యులు, సిబ్బంది ఖాళీలు ఉన్నట్టు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) గుర్తించింది. ఉమ్మడి పాలమూరులోని జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లా ఆస్పత్రులతోపాటు పలు సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇటీవల నివేదికలో పొందుపర్చింది. ఇందులో భాగంగా జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లా ఆస్పత్రుల్లో డాక్టర్లు, వైద్య సిబ్బంది నియామకం చేపట్టడంతోపాటు వసతులను మెరుగుపర్చాలని ప్రభుత్వానికి సూచించింది.


సగానికి పరిమితం..

ఉమ్మడి పాలమూరులోని మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లా ఆస్పత్రులతో పాటు బాదేపల్లి సీహెచ్‌సీ, ఎదిర, అడ్డాకుల, రాజాపూర్ పీహెచ్‌సీలు, అడ్డాకుల, కందూరు, క్రిస్టియన్‌పల్లి, జమిస్తాపూర్, రాజాపూర్, కుచిరేకల్ సబ్‌సెంటర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి కాగ్ నివేదికను రూపొందించింది. వీటిలో సగానికిపైగా వైద్య సిబ్బంది ఖాళీలు ఉన్నట్టు పేర్కొంది. బాదేపల్లి సీహెచ్‌సీలో 50 శాతం స్పెషలిస్టు వైద్యులు, 8 శాతం నర్సులు, 20 శాతం పారామెడికల్, 50 శాతం ఏఎన్‌ఎం పోస్టుల్లో ఖాళీలు ఉన్నట్టు గుర్తించింది. భారీ మొత్తంలో ఖాళీలతో రోగులకు సేవలు అందడం లేదని నివేదికతో తేటతెల్లమైంది.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నార్మల్, సీ సెక్షన్ ప్రసవాల వివరాలు (2016- 22 మధ్యకాలంలో)

జిల్లా	మొత్తం డెలివరీలు	నార్మల్	సీ సెక్షన్
మహబూబ్‌నగర్	86,366	49,376	36,990
నాగర్‌కర్నూల్	60,309	27,379	32,926
వనపర్తి	44,037	21,378	22,659
గద్వాల	57,273	34,914	22,359
నారాయణపేట	48,868	35,008	13,859

జిల్లా ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది ఖాళీలు ఇలా (శాతం)



వైద్య ప్రమాణాలూ అంతంతే..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవల నాణ్యతా ప్రమాణాల విషయంలోనూ ఉమ్మడి జిల్లాలోని ఆస్పత్రులు అట్టడుగున ఉన్నట్టు కాగ్ రిపోర్టులో వెల్లడైంది. ప్రధానంగా జోగుళాంబ గద్వాల జిల్లా ఆస్పత్రిలో రాష్ట్రంలోనే అత్యధిక సంఖ్యలో రోగుల తాకిడి ఉందని పేర్కొంది. అయితే ఇందుకు తగ్గ సౌకర్యాలు, వైద్యుల నియామకం లేదని స్పష్టం చేసింది. ఈ ఆస్పత్రిలో గంటకు సగటున 93 మంది చొప్పున పేషెంట్లు వస్తున్నట్టు గుర్తించింది. గద్వాల జిల్లా ఆస్పత్రిలో డెర్మటాలజీ, ఈఎన్‌టీ తదితర వైద్యులు అందుబాటులో లేకపోవడంతోపాటు ఆపరేషన్ థియేటర్‌లో కొన్ని రకాల ఆపరేషన్లకు అవసరమైన మౌలిక వసతులు సరిగా లేనట్టు దుయ్యబట్టింది. ఓబీజీ, మాతాశిశు ఆస్పత్రి విభాగాలు సరిగా పనిచేయడం లేదని, యాంటినేటల్ కేర్ విభాగం అందుబాటులో లేదని వివరించింది.

■ నారాయణపేట జిల్లా ఆస్పత్రిలో గంటకు సగటున 22 మంది పేషెంట్లు వస్తున్నారని పేర్కొంది. ఈ ఆస్పత్రిలో డెర్మటాలజీ, జనరల్ మెడిసన్, ఆయుష్, ఈఎన్‌టీ, సైకియాస్ట్రి, ఆప్తామాలజీ డాక్టర్లు లేకపోవడంతో రోగులకు వైద్యసేవలు అందడం లేదని కాగ్ తన నివేదికలో ప్రస్తావించింది.

ఇక్కడే అత్యధిక ఖాళీలు..

జిల్లా ఆస్పత్రుల్లో ఉన్న వైద్యులు, సిబ్బంది ఖాళీల విషయంలో జోగుళాంబ గద్వాల రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. ఈ ఆస్పత్రిలో మొత్తం 87 మంది డాక్టర్లకు గాను 28 మంది మాత్రమే ఉన్నారు. కాగా 68 శాతం ఖాళీలు ఉన్నాయి. అలాగే 73 మంది స్టాఫ్ నర్సులకు గాను 29 మంది మాత్రమే ఉండగా.. 60 శాతం మేర ఖాళీలున్నాయి. నారాయణపేట జిల్లా ఆస్పత్రిలోనూ 66 మంది డాక్టర్లకు గాను 32 మంది మాత్రమే ఉండగా, 52 శాతం ఖాళీలు ఉన్నాయి. మొత్తం 71 మంది నర్సులకు 31 మంది మాత్రమే ఉండగా, 56 శాతం ఖాళీలను భర్తీ చేయాల్సి ఉంది. భారీ సంఖ్యలో డాక్టర్లు, నర్సులు, వైద్య సిబ్బంది లేకపోవడంతో రోగులకు సరైన వైద్యం అందడం లేదు.

ఒక్క ఫార్మసిస్టు దిక్కులేదు..

రాష్ట్రంలోని అన్ని జిల్లా ఆస్పత్రుల్లో ఫార్మసిస్టుల నియామకం చేపట్టగా.. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఒక్క ఫార్మసిస్టు కూడా లేకపోవడం విస్మయం కలిగిస్తోంది. ఈ ఆస్పత్రికి కనీసం ఫార్మసిస్టుగా ఒక్కరిని కూడా ప్రభుత్వం మంజూరు చేయలేదని కాగ్ ఆక్షేపించింది. ఇక్కడి రోగులకు అందుతున్న వైద్యసేవల పట్ల అసంతృప్తి వ్యక్తం చేసింది. నారాయణపేట జిల్లా ఆస్పత్రిలో ఏడుగురు ఫార్మసిస్టులకు గాను ఐదుగురు అందుబాటులో ఉన్నారు.

‘నెట్టెంపాడు’లో సాంకేతిక సమస్య

- లిఫ్ట్ – 1 వద్ద ఎస్‌ఎఫ్‌డీ ప్యానల్ బోర్డులో లోపం
- కీలకమైన బోర్డులు పనిచేయకపోవడంతో నిలిచిన నీటి పంపింగ్
- నిపుణుల బృందం పరిశీలన



నెట్టెంపాడు ఎత్తిపోతల లిఫ్ట్- 1 గుడ్డెందొడ్డి పంప్ హౌస్‌లో ప్యానల్ బోర్డులను పరిశీలిస్తున్న బృందం

ధరూరు: నెట్టెంపాడు ఎత్తిపోతలలో సాంకేతిక సమస్య తలెత్తింది. ఎస్‌ఎఫ్‌డీ ప్యానల్ బోర్డులో సమస్య తలెత్తి మొరాయించడంతో మోటార్లతోపాటు నీటి పంపింగ్ నిలిచిపోయింది. ప్రియదర్శిని జూరాల బ్యాక్‌వాటర్ వైపు ఉన్న నెట్టెంపాడు లిఫ్టు–1 పంప్‌హౌస్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. వరదల సమయాల్లో నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపి రైతులకు సాగు నీరందించే ఈ ప్రాజెక్టుకు సంబంధించి మెయింటెనెన్స్ బాధ్యతలను మార్స్ (ఎంఏఆర్‌ఎస్) కంపెనీ చేపట్టింది. అయితే నెట్టెంపాడు మోటార్లు, ఇతర పనులు చేపట్టిన బీహెచ్‌ఈఎల్ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటికి పైగా బకాయి చెల్లించలేదని తెలుస్తోంది. ఈ సమస్యను పరిష్కరించాల్సింది బీహెచ్‌ఈఎల్ కంపెనీయే. అయితే బకాయిలు చెల్లించకపోవడం మూలంగా ఆ కంపెనీ ప్రతినిధులు ఇక్కడికి రావడం లేదని తెలుస్తోంది. పెండింగ్‌లో ఉన్న మెయింటెనెన్స్ బిల్లులకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఇరిగేషన్ శాఖ అధికారులతోపాటు రాష్ట్ర మంత్రితో మాట్లాడి బకాయిలను చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

సమస్య పరిష్కారం.. ఎత్తిపోతలు పునఃప్రారంభం

ఈ విషయమై పీజేపీ అధికారులను ‘సాక్షి’ వివరణ కోరగా.. లిఫ్టు–1 వద్ద ఎస్‌ఎఫ్‌డీ ప్యానల్ బోర్డులో సమస్య తలెత్తిన మాట వాస్తవమేనని.. మార్స్ కంపెనీ ప్రతినిధులు పరిశీలించి లోపాన్ని గుర్తించారన్నారు. రాత్రి సమస్యను పరిష్కరించి పంపులను పునఃప్రారంభించామని వివరించారు. నీటిని ఎత్తిపోయడం కొనసాగుతుందని తెలిపారు.

న్యాయవాదుల సంక్షేమానికి కృషి

అలంపూర్: న్యాయవాదుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన న్యాయవాదుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మలిపెద్ది సురేష్ కుమార్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టులోని న్యాయవాదుల సంక్షేమ సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జూనియర్ సివిల్ కోర్టు జడ్జీ కమలాపురం కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు జడ్జీని శాలువాతో సత్కరించారు. అనంతరం నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం చేశారు. అలంపూర్ న్యాయవాదుల సంక్షేమ సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి న్యాయవాది గవ్వల శ్రీనివాసులు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా యాకుబ్ బాష, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు, సహాయ కార్యదర్శిగా చిన్న కిషన్ రావు, కోశాధికారిగా గవ్వల శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులుగా తిమ్మారెడ్డి, రామోహన్, నాగయ్య, వేణుగోపాల స్వామి, మహేష్, లైబ్రెరీ కార్యదర్శిగా నరసింహ్మా, మహిళా న్యావాదుల ప్రతినిధులుగా రాజేశ్వరిలను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ...అందరి సహకారంతో బార్ కౌన్సిల్ ఎన్నికలు సజావుగా కొనసాగాయని, చాల రోజులుగా ఎన్నికలు నిర్వహించకుండా న్యాయవాదుల సంక్షేమాన్ని అగమ్యగోచరంగా మార్చారన్నారు.



అలంపూర్‌లో జడ్జి కమలాపురం కవితని సత్కరిస్తున్న నూతన కమిటీ సభ్యులు

ఆలయంలో అభివృద్ధి పనుల పరిశీలన



గోశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆలయ ఈఓ పురేందర్‌కుమార్

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామివారి ఆలయంలో పలు అభివృద్ధి పనులను మంగళవారం ఈఓ పురేందర్‌కుమార్ పరిశీలించారు. ముందుగా 60 అడగుల పొడవు, 25 అడుగుల వెడల్పుతో చేపడుతున్న గోశాల నిర్మాణ పనులు పరిశీలించారు. ఆకర్శనీయంగా.. గోమాతలకు సౌలభ్యంగా ఉండే విధంగా నిర్మాణం చేయాలని, ఇటీవల భక్తులు దేవస్థానానికి గోవులను ఇస్తుండటంతో వాటి సంరక్షణ కోసం ఈ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

విద్యుదీకరణ పనులు..

ప్రధాన ఆలయమైన బాలబ్రహ్మేశ్వర స్వామివారి దేవస్థానంలో కేంద్ర పురాతత్వశాఖ వారు విద్యుదీకరణ పనులు చేపడుతున్నట్లు సంబంధిత శాఖ వారు తెలిపారు. ప్రస్తుతం ఉన్న వైర్లు అన్ని వేలాడుతూ కొంత ఇబ్బందిగా మారాయి. నవ బ్రహ్మ ఆలయాలు అన్నింటిలో అక్కడి శిల్ప సంపదను ఆకర్శనీయంగా చూసే విధంగా విద్యుత్ ఆధునీకరణ పనులు చేపడుతున్నామని, వారం రోజులలో పనులు పూర్తి అవుతాయని అధికారులు తెలిపారు.

రేణుకాదేవికి ప్రత్యేక పూజలు

మంగళవారం కావడంతో బాలబ్రహ్మేశ్వర ఆలయ ప్రాంగాణంలోని శ్రీ రేణుకాదేవికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీ మంగళ, శుక్రవారాలు మాత్రమే ఈ పూజలు జరుగుతాయని దేవస్థానం అధికారులు తెలపారు. సంతానం లేని వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తే సంతాన ప్రాప్తి కలుగుతందని భక్తుల ప్రగాడ విశ్వాసమన్నారు.

ఆదర్శప్రాయుడు ప్రొఫెసర్ జయశంకర్

గద్వాల రూరల్: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చూపిన బాట అందరికీ ఆచరణీయమని ఆయన చూపిన బాటలో ముందుకు సాగాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో ఆరణలో బీసీ సంక్షేమ శాఖ అధ్వర్యంలో ప్రొఫెసర్ జయంతిని వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ బీఎం సంతోష్ పాల్గొని మాట్లాడారు. ప్రజల ఆకాంక్ష సాధన కోసం తన జీవితాన్ని మొత్తం త్యాగం చేసిన గొప్పమహనీయుడు అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఆవశ్యకతపై దేశవ్యాప్తంగా వివిధ వేదికల్లో బయటి ప్రపంచానికి చాటిచెప్పడమే కాకుండా వాటిగురించి పలు పుస్తకాలను రచించారన్నారు. జెడ్పీ సీఈవో కాంతమ్మ, ఏవో వీరభద్రప్ప, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ రమేష్‌బాబు, తెలంగాణ ఉద్యమకారులు అచ్చన్నగౌడ్, మోహన్‌రావు, బీసీ సంక్షేమశాఖ అధికారి సరోజ పాల్గొన్నారు.



ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

పక్కాగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన

ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ దరఖాస్తుల స్రూట్కటినీ ప్రారంభించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై సంబంధించిన అధికారులతో సమీక్షించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వాటి విభజన, అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేసుకుని వాటిని ఎలా వర్గీకరించుకోవాలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, జెడ్పీ సీఈవో కాంతమ్మ, ఏవో వీరభద్రప్ప, ఈఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

గద్వాల అర్బన్: స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో పని చేయాలని, తద్వారా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు , బాల్య వివాహాలను నిర్మూలించవచ్చని డీడబ్ల్యూఓ సుధారాణి అన్నారు. రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలరక్షక్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడబ్ల్యూఓ మాట్లాడుతూ డ్రగ్స్, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు.

క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

జడ్చర్ల: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ విష్ణు తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని పోలెపల్లికి చెందిన నక్క సత్యనారాయణ (42) సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సవిత ఫిర్యాదు మేరకు మంగళవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కేటీ దొడ్డి: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలోని చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఎర్సందొడ్డికి చెందిన కుర్వ బుడ్డన్న (58) తన వ్యవసాయ పొలాన్ని సాగుకు సిద్ధం చేస్తుండగా ప్రమాదవశాత్తు సర్వీస్ వైర్లు తెగి అతడికి తగిలాయి. దీంతో ఆయన ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి బలవన్మరణం

అడ్డాకుల: కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు చెట్టుకు ఉరేసుకొని మృతిచెందిన ఘటన మూసాపేట మండలం దాసర్‌పల్లి శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ పి.శ్రీనివాసులు కథనం మేరకు.. పొన్నకల్‌కు చెందిన ద్యావరి వీరేష్ యాదవ్(38)కు కొన్నేళ్ల కిందట గాజులపేటకు చెందిన పుష్పలతతో వివాహమైంది. తర్వాత కుటుంబ కలహాలతో భార్యాభర్తలు ఇద్దరు విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత 2016లో మహబూబ్‌నగర్ మండలం వెంకటాపూర్‌కు చెందిన సంధ్యను పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ క్రమంలో విడిపోయిన మొదటి భార్య పుష్పలత ఇటీవల మళ్లీ పొన్నకల్‌కు వచ్చి వీరేష్‌తో రోజు గొడవపడుతుందేది. సోమవారం ఉదయం వీరేష్, పుష్పలత ఇద్దరు గొడవ పడటంతో జీవితంపై విరక్తి చెందిన వీరేష్ ఇంటి నుంచి బయటకు వెళ్లి.. మూసాపేట మండలం దాసర్‌పల్లి శివారులోని మాలగుట్ట సమీపంలో ఆలకుంట వద్ద చెట్టుకు ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. మంగళవారం ఉదయం చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించి రెండో భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.శ్రీనివాసులు తెలిపారు.

బాలికపై అత్యాచారం.. వ్యక్తిపై కేసు నమోదు

మహమ్మదాబాద్: బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి మంగళవారం బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలియజేశారు.

అప్పుల బాధ భరించలేక.. సినీ డైరెక్టర్ బలవన్మరణం


కొమారి జానకిరాం (ఫైల్)

గోపాల్‌పేట: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రానికి చెందిన కొమారి జానకిరాం(43) హైదరాబాద్‌లో ఉంటూ సినీరంగంలో 20 ఏళ్లుగా పనిచేస్తున్నాడు. రెండేళ్ల కిందట సుమారు రూ.కోటి వ్యయంతో స్వీయ దర్శకత్వంలో జీఎస్టీ అనే సినిమా తీశారు. సగం డబ్బు అప్పు చేసి సినిమా తీయడంతో కొంతకాలంగా అప్పుల వాళ్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇదే క్రమంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఓ లాడ్జిలో ఉరేసుకున్నాడు. సోమవారం గది తలుపులు తెరవకపోవడంతో నిర్వాహకులు కూకట్‌పల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి గది తలుపులు తెరచి చూడగా అప్పటికే మృతిచెందాడు. ఈ విషయాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

తమ్ముడు అదృశ్యం..

అన్న కొమారి జానకిరాం మృతి వార్త తెలుసుకున్న తమ్ముడు కొమారి బాలకృష్ణ సోమవారం ఎంతో భావోద్వేగానికి గురై.. బైక్ తీసుకొని ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయాడు. అతని ఫోను సైతం స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. దీంతో జానకిరాం అంత్యక్రియలు కూడా నిలిచిపోయాయి. అతను ఏమి చేసుకున్నాడేమోననే ఆందోళనలో కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఉన్నారు. నాగర్‌కర్నూల్ సమీపంలోని కొల్లాపూర్ చౌరస్తాలో పురుగు మందు కొనుగోలు చేసి శ్రీశైలం వైపు వెళ్లారని తెలియడంతో బంధువులు అక్కడికి వెళ్లి వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు.


వివిధ డిజైన్లలో గద్వాల చీరలు

అదిరే పట్టు.. ఆధునిక లుక్కు

కాలానుగుణంగా ప్రత్యేకత చాటుతున్న పాలమూరు 'చేనేతలు'

సంస్థానాధీశుల కాలం నుంచి ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్లు యువతులు, మహిళల మనసును కట్టిపడేసే డిజైన్లతో ఆకట్టుకునేలా చీరలను తయారు చేస్తున్నారు ఉమ్మడి పాలమూరులోని చేనేత కార్మికులు. నాటి తరం సంప్రదాయాన్ని కొనసాగిస్తూనే నేటితరం అవసరాలకు అనుగుణంగా కాటన్, సిల్క్‌లను కలిపి మగువలకు నచ్చేలా అద్భుతమైన చీరలు నేస్తున్నారు. సాధారణ నూలుతోనే ఆకర్షించే నేస్తూ.. విభిన్నమైన చీరలు రూపుదిద్దడంలో తమకు తామే సాటని చాటుతున్నారు. మగ్గాలపై తమలోని నైపుణ్యాలను బయటకు తీసి, చీరలపై అందమైన డిజైన్లుగా మారుస్తున్నారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

– మహబూబ్‌నగర్ డెస్క్

- సాధారణ నూలుతోనే అందమైన డిజైన్లు
- ఆకర్షించేలా విభిన్నమైన చీరలను నేయడంలో దిట్ట
- తిరుమల శ్రీనివాసుడికి ఎరువాడ పంచె అందిస్తున్న గద్వాల నేతన్నలు
- ఆన్‌లైన్‌లోనూ చీరలకు పెరుగుతున్న గిరాకీ


నారాయణపేటలో మొగ్గంపై చీర నేస్తున్న చేనేత కార్మికులు (ఫైల్)

గద్వాల చీరకు చెదరని ఆదరణ

గద్వాల నేత చీరలు దేశ, విదేశీ వనితల ఆదరణ పొందుతూ నేటికి ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. రాష్ట్రంలోని ప్రధాన నగరాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వివాహాది శుభకార్యాల సందర్భంగా మహిళలు చీరలు కొనుగోలు చేసేందుకు ఇక్కడికే వస్తున్నారు. గద్వాల సంస్థానం ఏర్పడినప్పటి నుంచి నాలుగు శతాబ్దాలుగా కాలానుగుణంగా ప్రత్యేకత ఉండేలా ఆధునిక సాంకేతికతను జోడిస్తూ ఇక్కడి నేతన్నలు చీరలను సిద్ధం చేస్తున్నారు. కాటన్ చీరకు అంచు, కొంగు బార్డర్‌లో గద్వాల వారసత్వంగా వస్తున్న డిజైన్లను కొనసాగిస్తున్నారు. ఒక్కో చీర రూ.1000 నుంచి రూ.2 లక్షల వరకు పలుకుతాయి. నడిగడ్డ ప్రాంతంలో దాదాపు 6వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి బతుకుతున్నారు. గద్వాల జరీ చీరలకు 2008లోనే భౌగోళిక గుర్తింపు (జియోగ్రాఫికల్ పేటెంట్) లభించింది. ప్రతి ఏటా దసర బ్రహ్మోత్సవాల్లో తిరుమల శ్రీవారికి పట్టు వస్త్రాలు గద్వాల నుంచే వెళతాయి. రాష్ట్రంలోనే దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో సైతం గద్వాల చీరలకు డిమాండ్ ఏర్పడింది.

పెట్టుబడి సాయం అందించాలి..



వ్యవసాయ రంగంలో రైతులకు ఇస్తున్న తరహాలోనే చేనేత కార్మికులకు పెట్టుబడి సాయం అందించాలి. ప్రభుత్వం సంఘాలను ప్రోత్సహించి చేనేత కార్మికులను ఆదుకోవాలి. ప్రభుత్వం చేనేత రంగాన్ని ఉపాధి హామీతో అనుసంధానిస్తే కార్మికులకు, సంఘాలకు మేలు జరుగుతుంది.

– రామలింగేశ్వర కాంప్లే, చేనేత క్లస్టర్ చైర్మన్, గద్వాల

కాటన్ చీరలకు బార్డర్ హైలెట్



బయట మార్కెట్‌లో ఎన్నో రకాల కాటన్ చీరలు అందుబాటులో ఉన్నా చాలా వరకు నారాయణపేట కాటన్‌నే ఇష్టపడతాం. ముఖ్యంగా ప్యూర్ కాటన్ చీరలు అమ్మడమే ఇందుకు కారణం. చూడటానికి మంచి లుక్ ఉంటుంది. మిగతా చీరల కంటే ఈ చీరలకు బార్డర్ హైలెట్‌గా ఉంటుంది. అన్ని 'పేట' కాటన్ చీరలకు కోటకొమ్ములు ఉండటం ప్రత్యేకత.

– డాక్టర్ విరోజ, నారాయణపేట

'పేట' పట్టుకు లైన్స్ ప్రత్యేకత



పట్టుచీరలకు నారాయణపేట ప్రత్యేక స్థానం ఉంది. హైదరాబాద్‌లో ఎక్కువ మంది 'పేట' పట్టును ఇష్టపడతారు. మిగతా చీరల కంటే 'పేట' పట్టుకు లైన్స్ ప్రత్యేకతగా నిలుస్తాయి. సినీనటి అక్కినేని అమల వచ్చిన తర్వాత క్రేజ్ బాగా పెరిగింది. ప్రస్తుతం సీరియల్ నటులు, యాంకర్స్ చాలా వరకు 'పేట' పట్టు, కాటన్ చీరలనే కావాలని కోరుకుంటున్నారు.

– జ్యోత్స్న, నారాయణపేట

ఒక్కో చీరకు రూ.8వేల కూలీ



చేనేతనే మా ప్రధాన వనరు. కుటుంబ పోషణ కోసం మగ్గంపై జారీ చీరలను తయారు చేస్తున్నాం. నెల రోజుల్లో నేను, నా భర్త కలిసి మూడు చీరలు చేస్తాం. ఒక్కో చీర తయారీకి ఎనిమిది వేల రూపాయలు ఇస్తారు. వీటితో కుటుంబపోషణ చేసుకుంటాం.

– చిన్ని సునీత, అమరచింత

మగువల మనసు దోచే 'పేట' చీరలు

పల్లె నుంచి పట్నం వరకు అడిగి మరీకొనే చీరల్లో నారాయణపేట 'పట్టు' ఒకటి. ఇక్కడి చేనేతకు 120 ఏళ్ల చరిత్ర ఉంది. అగ్గిపెట్టెలో పట్టేంత చీరను నేసి రికార్డు సృష్టించిన ఘనత కూడా ఉంది.



1983లో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ సైతం 'పేట' చీరలకు కట్టుకున్నారంటే ఎంతటి గుర్తింపు దక్కిందో అర్థం చేసుకోవచ్చు. నారాయణపేట జిల్లాకేంద్రంతో పాటు జాజాపూర్, కోటకొండలో చేనేత కార్మికులు ఎక్కువగా ఉన్నారు. ఇక్కడ నీవాళి ధనవతి, ప్లైన్, నివాళి ధనవతికడ్డి, నివాళి శివశంభుప్లైన్, సైటానీ, నిఖల్, పారాస్, నివాళి శివశంభుకడ్డి, నిపాణి ప్లెయిన్ బార్డర్‌పై ఆలయం డిజైన్లతో కూడిన పట్టు చీరలు తయారు చేయడంతో 2015లో జియోగ్రాఫికల్ పేటెంట్ హక్కు సంపాదించుకుంది. మాస్టర్ వీవర్స్ హైదరాబాద్, బెంగళూరు నుంచి ముడిసరుకును దిగుమతి చేసుకొని.. మార్కెట్‌కు కావాల్సిన రంగులు అద్ది నేత కార్మికులకు అందించి చీరలు తయారు చేయిస్తారు. ఈ చీరలను తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలోని అన్ని నగరాలకు పంపిస్తారు.

వేర్వేరు బ్రాండ్ పేర్లతో అమరచింత చీరలు

అమరచింతలో ఇప్పటికీ స్వహస్తాలతో మగ్గాలపై అందమైన చీరలను తయారు చేస్తున్నారు. ఇక్కడ తయారు చేసిన చీరలను గద్వాల, హైదరాబాద్‌కు చెందిన మాస్టర్ వీవర్స్ కొనుగోలు చేసి.. వారివారి బ్రాండ్‌ల పేరుతో విక్రయిస్తున్నారు. నాణ్యతతో పాటు మన్నిక కూడా బాగుండడంతో వ్యాపారులు ప్రత్యేకంగా పట్టు చీరలను తయారు చేయిస్తున్నారు. స్థానిక పద్మశాలీలు శ్రీశైలం మల్లికార్జునస్వామికి శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఇక్కడ తయారు చేయించిన పట్టువస్త్రాలు సమర్పిస్తారు. కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలకు సైతం ఇక్కడి పట్టువస్త్రాలనే సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. వనపర్తి జిల్లాలో అమరచింత, కొత్తకోట, తదితర ప్రాంతాల్లో 1200 మగ్గాలుండగా.. 4 వేల మంది జీవనం సాధిస్తున్నారు.

చేనేతలకు పుట్టినిల్లుగా 'రాజోళి'

సాధారణ నూలుతో చూడగానే ఆకర్షించే విధంగా పట్టుచీరలను తయారు చేసే రాజోళి చేనేత కార్మికులకు పుట్టినిల్లుగా ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంతంలో దాదాపు 600 కుటుంబాలు, 1,500 మంది కార్మికులు ఈ వృత్తిలో ఉన్నారు. మీనా టర్నింగ్, కోటకొమ్మ, పైతాన్, కుట్టు, బ్రోకెట్ లాంటి ఇక్కడ తయారు చేస్తారు. ముఖ్యంగా మీనా టర్నింగ్ చీరల తయారీలో కార్మికుల కళ ఉట్టిపడుతుంది. చీర ఒక రంగులో ఉంటే.. దీనిపై వచ్చే పక్షి బొమ్మలు మరో రంగులో ఉంటాయి. పక్షి కన్ను కూడా మరో రంగులో ఉండేలా డిజైన్ చేస్తారు. బ్రోకెట్ చీరలు జరీతోనే తయారు చేస్తారు. ఈ చీరలకు ఆన్‌లైన్ మంచి గిరాకీ ఉంది. ఉమ్మడి జిల్లాలో శాంతినగర్, అయిజ, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ ప్రాంతాల్లో విక్రయశాలలు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో చేనేత కార్మికులు 10,550  | చేనేత సొసైటీలు 107 | మాస్టర్ వీవర్స్ 100 (దాదాపు) |  చేనేత మగ్గాలు 4,296

జూరాలకు తగ్గిన వరద

ధరూర్/ రాజోళి/ ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గింది. సోమవారం ప్రాజెక్టుకు 2,65,000 క్యూసెక్కులు రాగా.. మంగళవారం సాయంత్రానికి 2,52,000 క్యూసెక్కులు వచ్చిందని పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు వద్ద 33 క్రస్టు గేట్లను ఎత్తి 2,22,766 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 22,421 క్యూసెక్కుల నీటిని కలిపి దిగువన శ్రీశైలానికి వదిలారు. అలాగే కుడి కాల్వకు 717 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 820, భీమా లిఫ్టు-1కు 650, లిఫ్టు-2కు 750, కోయిల్‌సాగర్‌కు 315, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 100, సమాంతర కాల్వకు 850 క్యూసెక్కులు వదలగా మరో 70 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.415 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

■ ఎగువనున్న ఆల్మట్టి ప్రాజెక్టుకు 3,02,660 క్యూసెక్కుల వస్తుండటంతో.. 2,06,600 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 123.081 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 86.335 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అలాగే నారాయణపూర్ ప్రాజెక్టుకు 2 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. దీంతో ప్రాజెక్టు వద్ద 25 గేట్లను ఎత్తి 1,94,860 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 33.313 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 27.64 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సుంకేసులలో 14 గేట్లు..

సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి వస్తున్న వరద నీరు మంగళవారం తగ్గుముఖం పట్టింది. ఎగువ నుంచి 63 వేల క్యూసెక్కులు రాగా.. 14 గేట్లను తెరిచి 60,354 క్యూసెక్కుల నీటిని దిగువకు, 2,445 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు వదిలినట్లు జేఈ రాజు తెలిపారు.

82.545 మి.యూ., విద్యుదుత్పత్తి

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఇప్పటి వరకు 82.545 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేపట్టినట్లు జెన్‌కో ఎస్ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. జూరాలకు అత్యధికంగా వరద వస్తుండటంతో దిగువ జూరాలలో విద్యుదుత్పత్తి చేపట్టలేకపోతున్నామని, ఎగువలో మాత్రం 5 యూనిట్లలో విద్యుదుత్పత్తి కొనసాగుతుందని చెప్పారు.

మేకపోతుపై చిరుత దాడి

ఖిల్లాఘనపురం: చిరుత పులి రాత్రివేళలో గొర్రెల మందపై దాడి చేసి ఓ మేకపోతును ఎత్తుకెళ్లి చంపిన ఘటన మంగళవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. గొర్రెల కాపరుల వివరాల ప్రకారం అప్పారెడ్డిపల్లికి చెందిన కొత్తగొల్ల ఊషన్న తన గొర్రెల మందను సోమవారం రాత్రి పర్వతాపురం శివారులోని మనిగిళ్ల బాలకిష్టయ్య పొలంలో ఉంచాడు. మంగళవారం తెల్లవారు జామున చిరుత పులి గుట్ట పై నుంచి నేరుగా మంద దగ్గరకు వచ్చి అందులోంచి ఓ మేకపోతును ఎత్తుకుని గుట్ట పైకి వెళ్లింది. అక్కడే ఉన్న కాపరి చిరుతను గమనించినా భయంతో శబ్దం చేయకుండా పడుకుని ఉండిపోయాడు. విషయాన్ని ఫారెస్టు అధికారులకు తెలియజేయడంతో డిప్యూటీ రేంజ్ అధికారి భాస్కరాచారి, సిబ్బంది ఆంజనేయులు ఘటన జరిగిన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. గుట్టల్లో చిరుత తిని వదిలేసిన మేకపోతు కనిపించింది.

మృతదేహం లభ్యం

కోయిల్‌కొండ: మండల పరిధిలోని భవానీసాగర్‌లో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. సదరు వ్యక్తికి సుమారుగా 30 ఏళ్లు ఉంటాయన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

వైద్యురాలి నిర్లక్ష్యానికి బాలింత బలి


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

- ఆందోళనకు దిగిన బాధిత కుటుంబ సభ్యులు
- ఆస్పత్రిని తనిఖీ చేసిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రైవేటు ఆస్పత్రి వైద్యురాలి నిర్లక్ష్యంతో బాలింత మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో సోమవారం చోటుచేసుకోగా.. మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రానికి చెందిన కావ్య(23)ను హైదరాబాద్‌కు చెందిన ప్రశాంత్‌కుమార్‌తో ఏడాది కిందట వివాహమైంది. కావ్య గర్భం దాల్చినప్పటి నుంచి జిల్లా కేంద్రంలోని ప్రియాంక ఆస్పత్రిలో చెకప్ చేయించుకుంటుంది. ఈమెకు సోమవారం తెల్లవారుజామున పురిటి నొప్పులు రావడంతో ఆస్పత్రికి వెళ్లగా.. ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకున్నారు. పురిటినొప్పులు ఎక్కువ కావడంతో సాయంత్రం ఆపరేషన్ చేసి మగశిశువును బయటకు తీశారు. కావ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ఆస్పత్రి యజమాన్యం సూచన మేరకు కుటుంబ సభ్యులు బాలింతను అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే బాలింత మృతిచెందిందని నిర్ధారించారు. మంగళవారం ఉదయం విషయం తెలుసుకున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.వెంకటదాసు బృందం ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించి కొన్ని రికార్డులు స్వాధీనం చేసుకున్నారు.


కావ్య(ఫైల్)

బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రి వైద్యురాలు డా.ప్రియాంక నిర్లక్ష్యంతోనే కావ్య మృతిచెందిందని ఆరోపిస్తూ.. బాధిత కుటుంబ సభ్యులు, పలు రాజకీయ పార్టీల నాయకులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న నాగర్‌కర్నూల్ ఎస్ఐ గోవర్ధన్ సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

■ ప్రియాంక ఆస్పత్రిలో రెండు నెలల కిందటే ఆస్పత్రికి వచ్చిన గర్భిణికి సూదిమందు వికటించడంతో ఆమె మృత్యువాత పడటంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రియాంక ఆస్పత్రిని సీజ్ చేశారు. కొద్ది రోజుల తర్వాత ఆస్పత్రిని మళ్లీ తెరిచి వైద్యం అందిస్తుండగా.. మరో బాలింత మృత్యువాత పడింది. సంఘటనపై డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.వెంకటదాసును వివరణ కోరగా.. సంఘటనపై కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు తెలియజేశారు. ఎస్ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని విచారణ చేస్తున్నట్లు తెలియజేశారు.

ఎమ్మెల్యే పరామర్శ..

విషయం ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి తెలియడంతో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా గతంలో ప్రియాంక ఆస్పత్రిలో పలువురు గర్భిణులు వివిధ కారణాలతో మృతి చెందిన సంఘటనలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌కు ఫోన్ ద్వారా మాట్లాడి ప్రియాంక ఆస్పత్రి నిర్వాహకులతో పాటు ఆస్పత్రి వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గొర్రెల కాపరిపై కర్రలతో దాడి.. మృతి


కారును పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లకుండా అడ్డుకుంటున్న మృతుని బంధువులు

కాటవరంలో ఉద్రిక్తత, విషాదం


పాలెం కొల్లంపల్లి (ఫైల్)

అడ్డాకుల: మండలంలోని కాటవరం గ్రామంలో ఓ గొర్రెల కాపరిని కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కర్రలతో దాడి చేయడంతో మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ శ్రీనివాస్, బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పాలెం కొల్లంపల్లి(41), పద్మమ్మ దంపతులు. వీరికి మాధవి, అంకిత్ ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్నేళ్ల నుంచి కొల్లంపల్లి గొర్రెలను పెంచుతూ జీవనం సాగిస్తుండగా.. భార్య పద్మమ్మ ఇంటికి సమీపంలోనే కిరాణ డబ్బా పెట్టుకుని నడిపిస్తోంది. ఈ క్రమంలో కొల్లంపల్లి మంగళవారం ఉదయం గొర్రెల వద్ద నుంచి ఇంటికి వచ్చి టిఫిన్ చేసి రహదారి పక్కనే ఉన్న గొర్రెల వద్దకు వెళ్లాడు. అప్పటికే కొల్లంపల్లి ఇంటి వద్ద కారులో కాపుకాసిన గుర్తుతెలియని వ్యక్తుల తోపాటు కొందరు స్థానికులు పొలం వద్దకు వెళ్లి కర్రలతో దాడి చేశారు. పిడిగుద్దులు గుద్దుతూ కర్రలతో బలంగా కొట్టడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. రహదారిపై వెళ్లే వారు గుర్తించి బంధువులకు సమాచారం చేరవేశారు. బంధువులు, పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లేలోపే నిందితులు పరారయ్యారు. అడ్డాకులకు చెందిన మహేష్‌యాదవ్ తన కారులో బాధితుడిని ఆస్పత్రికి తరలించేలోపు ప్రాణాలు వదిలాడు. అక్రమ సంబంధం నేపథ్యంలో దాడి జరిగినట్లు తెలుస్తోంది. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కారు అడ్డగింతతో ఉద్రిక్తత

కొల్లంపల్లిపై దాడి చేసిన వారు కారులోనే వచ్చారని, మృతుని ఇంటి ముందే కారుని ఉంచి వెళ్లడంతో పోలీసులు దాన్ని స్టేషన్‌ను తరలించడానికి ప్రయత్నించడం కొంత ఉద్రిక్తతకు దారి తీసింది. కారును ఇక్కడి నుంచి తీయొద్దని మృతుని బంధువులు అరగంట పాటు అడ్డుకున్నారు. చివరికి పోలీసులు వెంకట్రాములు, నరేష్ వారికి నచ్చజెప్పి కారును క్రేన్ సాయంతో స్టేషన్‌కు తీసుకెళ్లారు. కొల్లంపల్లి మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

వాడ్యాల్‌లో పట్టపగలు చోరీ


బోరున విలపిస్తున్న బాధితురాలు

మిడ్జిల్: మండల పరిధిలోని వాడ్యాల్‌లో మంగళవారం మధ్యాహ్నం వేములకు వెళ్లే ప్రధాన రహదారికి, అలాగే పాఠశాలకు అనుసరించి నివాసగృహాల మధ్యలో ఉన్న ఇంటి తాళం పగలగొట్టి పట్టపగలు చోరీ జరిగిన సంఘటన చోటుచేసుకుంది. గ్రామస్తులు, ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మాదారం నాగయ్య, భార్య పద్మమ్మతో కలిసి వ్యవసాయ పనులకు ఉదయం 10 గంటలకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. కుమారుడు కళాశాలకు వెళ్లడంతో ఇంటి తాళంచెవి సమీపంలో పెట్టి వెళ్లారు. అన్న కుమారుడు పెళ్లి కోసం రూ.17 వేల నగదు తీసుకొచ్చి బీరువాలో పెట్టారు. ఆ డబ్బులతో బంగారు ఉంగరం చేయిద్దామని సాయంత్రం ఇంటికి వచ్చి బీరువాలో డబ్బులను చూసే సరికి బీరువాలో కన్పించలేదు. అలాగే బీరువాలోని 5.5 తులాల బంగారు వస్తువులు(నాను, నక్లెస్) అలాగే 80 తులాల వెండి కాళ్ల కడియాలు కూడా కన్పించకపోవడంతో బోరున విలపించారు. చుట్టుపక్కల వారు వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు వెళ్లి పరిశీలించారు. ఈ విషయం ఉన్నత అధికారులకు వివరించారు. క్లూస్ టీం వచ్చి వెలిముద్రలను సేకరించారు.

నాగర్‌కర్నూల్‌లో పలు ఇళ్లలో..

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తుతెలియని వ్యక్తులు జిల్లా కేంద్రంలోని శ్రీపురంరోడ్డులో పలు ఇళ్లలో చోరీతో పాటు చోరీకి యత్నించిన సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీపురం రోడ్డులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని ఉప్పల సుధాకర్ ఇంట్లో సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, ఇంటి తలుపులు పగలగొట్టి చోరీకి యత్నించారు. అదే విధంగా దస్తగిర్‌ఖాన్ వ్యక్తి ఇంటి తలుపులు విరగొట్టి బీరువాపై ఉంచిన బ్యాగులో తులంన్నర బంగారు కమ్మలను చోరీ చేశారు. రఫీ అనే వ్యక్తి ఇంట్లో నాలుగు డ్రిల్ మిషన్లు చోరీ చేసి పరారయ్యారు. ఓ ఇంట్లో చోరీకి పాల్పడుతుండగా మరో వ్యక్తి బయట కాపలా ఉండే దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఎస్ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలియజేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■మీరు బైబ్యాక్ అగ్రిమెంట్‌తో లాభదాయకమైన లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ వ్యాపారాన్ని ప్రారంభించండి. (ప్రభుత్వ ఆమోదితము) 8376001873, 9643010487, 83760 89771, 011-25920179

WANTED

■ఎలాన్ హోండా షోరూమ్‌లో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, మరికల్ ఏరియాలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, సర్వీస్ అడ్వయిజర్స్, టెలికాలర్స్, మెకానిక్స్, హెల్పర్స్ కావలెను. ఆఫీసు సమయం 9:30 AM to 7:00 PM Contact : 8498056136

సాక్షి ద్వారా మీ చిట్టారి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి
HAPPY BIRTHDAY
కేవలం రూ. 500/-

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు ఎటువంటి వాటిని విశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వవలసిందిగా మా పాఠకులను కోరుచున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు. - సాక్షి మేనేజర్